యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో తరలింపు
- పట్టించుకోని అధికారులు

తరిగొప్పుల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇసుక అక్రమ రవాణా దారులకు వరంగా మారింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. వీఐపీల కాన్వాయిని తలపించేలా పదుల సంఖ్యలో పట్టపగలే ఇసుక అక్రమ రవాణా సాగుతుంటే అధికారులు కన్నెత్తి చూడడంలేదు. పోలీసు, రెవెన్యూ శాఖ అధికారుల మధ్య సమన్వయం కొరవడడం దళారులకు కాసులు తెచ్చిపెడుతుంది. మండలంలో ఇసుక వనరులు లేకపోవడంతో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఖాత గ్రామ శివారులోని వాగు నుంచి మండలంలోని వాచ్యాతండా, భోజ్యాతండాలకు ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిస్తూ ఇసుక దళారులు సొమ్ముచేసుకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక అక్రమ రవాణా దారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


పట్టపగలే ట్రాక్టర్‌లో రవాణా చేస్తున్న ఇసుక

కఠినచర్యలు తీసుకుంటాం..



అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేరుతో అక్రమ ఇసుక రవాణా చేస్తే ఉపేక్షించేది లేదు.

– మొగుళ్ల మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


రఘునాథపల్లి: అవగాహన కల్పిస్తున్న సంధ్యారాణి

రఘునాథపల్లి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఏఎన్‌ఎం సంధ్యారాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ–1 కేంద్రంలో పోషణపక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రంలో అందించే బాలామృతం ప్లస్, అనుబంధ ఆహారంతో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ జె అరుణ, ఆశ వర్కర్ రజిత, వీఓఏ శిరీష పాల్గొన్నారు.


బచ్చన్నపేట: అవగాహన కల్పిస్తున్న ప్రశాంత్‌రెడ్డి

తరిగొప్పుల: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని పల్లె దావాఖానా వైద్యుడు ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రం కమ్మరిపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలల తల్లులకు పోషక విలువలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రంగమ్మ, అంగన్‌వాడీ టీచర్ భూక్య వనిత, ఏఎన్‌ఎం వసంతరాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

22న భూభారతిపై అవగాహన సదస్సు

తరిగొప్పుల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతిపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈనెల 22వ తేదీన మండలకేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో సదస్సు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ మొగుళ్ల మహిపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి ఎంతగానో దోహదపడుతుందన్నారు. అధిక సంఖ్యలో రైతులు పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

నేడు బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: భూ భారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టంపై నేడు(బుధవారం) అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ప్రకాశ్‌రావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ భూ భారతి చట్టంలోని పలు అంశాలను క్షుణ్ణంగా వివరిచండం జరుగుతుందన్నారు. ఈ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న సదస్సుకు జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారని, రైతులు, నాయకులు సకాలంలో హాజుకావాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

జనగామ రూరల్: మున్సిపల్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెల మొదటి రోజు వేతనాలు ఇవ్వాలని టీడీపీ నాయకుడు జేరుపోతుల కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఏఓకు వినతిప్రతం అందజేశారు. తాటికాయల. కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


గౌస్‌పాషా (ఫైల్)

రఘునాథపల్లి: హనుమకొండ–హైదరాబాద్ జాతీయ రహదారిలోని గోవర్ధనగిరి వద్ద బస్సు కోసం వేచి చూస్తుండగా కారు ఢీ కొన్న ఘటనలో యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గోవర్ధనగిరి గ్రామానికి చెందిన ఎండీ అబ్బాస్‌కు ఇద్దరు కుమారులు ఎండీ గౌస్‌పాషా (28), ఎండీ అఫుపాషా జనగామ చికెన్ సెంటర్‌లో పని చేస్తుండేవారు. సోమవారం రాత్రి అన్నదమ్ములు జనగామకు వెళ్లేందుకు గోవర్ధనగిరి బస్టాప్ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో హనుమకొండ నుంచి జనగామ వైపు అతి వేగంగా నిర్లక్ష్యంగా కారు నడుపుతున్న డ్రైవర్ మాదారపు శబరినాథ్ బస్సు కోసం వేచి చూస్తున్న ఇద్దరిని కారుతో ఢీ కొట్టాడు. దీంతో గౌస్‌పాషాకు తీవ్ర గాయాలు కాగా అఫుపాషాకు కాలు విరిగింది. స్థానికులు గుర్తించి వెంటనే 108లో జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం గౌస్‌పాషాను వరంగల్ ఎంజీఎంకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. మృతుడి తండ్రి అబ్బాస్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు.

విరాళం



బచ్చన్నపేట: పడమటికేశ్వాపూర్ గ్రామంలో గౌడ కులస్తులు నూతనంగా నిర్మిస్తున్న రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు జంగిటి విద్యానాథ్, నాయకులు రూ.50వేల విరాళాన్ని మంగళవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక సేవతోనే ఆత్మ సంతృప్తి కలుగుతుందని అన్నారు. మాజీ సర్పంచ్ గిద్దెల రమేష్, నాయకులు చల్ల సంతోష్‌రెడ్డి, నర్సింహయాదవ్, ఐలయ్య, మల్లయ్య, సత్తయ్య, ప్రసాద్, రమేష్, హరి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పరామర్శ

బచ్చన్నపేట: మండల కేంద్రానినికి చెందిన బొమ్మెన గణపతి ఇటీవల మృతి చెందాడు. కాగా, మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. మాజీ ఎంపీటీసీ బొమ్మెన అరుణ, ఆంజనేయులు, ఇర్రి రమణారెడ్డి, వడ్డెపల్లి మల్లారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, నరేందర్, సిద్దిరాంరెడ్డి, అజీమ్, గోపీ, విజయ్, వినోద్‌కుమార్, పుల్లయ్య పాల్గొన్నారు.

సబ్ జైలులో నాయకుడికి..

జనగామ రూరల్: బీఆర్‌ఎస్ పట్టణ దళిత నాయకుడు తిప్పారపు విజయ్ జిల్లా సబ్ జైలులో ఉండగా మంగళవారం మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ములాఖత్ తీసుకుని ఆయనను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ధైర్యంగా ఉండాలని విజయ్‌కు చెప్పారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


స్టేషన్‌ఘన్‌పూర్: ఎంపీడీఓ విజయశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు

స్టేషన్‌ఘన్‌పూర్: గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ మండల కమిటీ అధ్యక్షుడు కె.రాజు, ఉపాధ్యక్షుడు బి.బాలనర్సు డిమాండ్ చేశారు. ట్రెజరీలో నిలిచిన 2024 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల బకాయి వేతనాలను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ ఉద్యోగులు, వర్కర్ల ఆధ్వర్యంలో ఎంపీడీఓ విజయశ్రీకి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులకు ఎన్నికల ముందు చేసిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సీహెచ్.నాగరాజు, కె.శ్రీనివాస్, ఆర్.జగన్నాథం, రామచంద్రు, వెంకటనర్సు, సిద్దులు, కుమార్, అనీల్, వెంకన్న, రాజశేఖర్, సలీమ్, లక్ష్మీ, ఎల్లయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

లింగాలఘణపురం: గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను ఈ నెల 19 వరకు పరిష్కరించ కుంటే నిరవధిక సమ్మె చేపడుతామని మంగళవారం మండల పంచాయతీ సిబ్బంది ఎంపీడీఓ జలేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు తిప్పారపు యాకుబ్, ఉపాధ్యక్షుడు ఇట్టబోయిన మహేందర్, కార్యదర్శి నర్సింహ్ములు, సిబ్బంది కిరణ్, రేణుక, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

అష్టదళ పాదపద్మారాధన పూజ


చిల్పూరు: పూజల్లో పాల్గొన్న భక్తులు


పాలకుర్తి: పూజ చేస్తున్న మాలధారులు

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో అష్టదళ పాదపద్మారాధన పూజ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ నిర్వహించారు. జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, లక్ష్మీ, మల్లికార్జున్, హరిశంకర్, వసంత,మహేష్, గాదె శేఖర్,రాజేష్, విశాల్, కృష్ణ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి...

పాలకుర్తి: వల్మిడి గుట్టపై ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయంలోని ఆంజనేయస్వామికి హనుమాన్ మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. సోమరాం రెడ్డి, జిల్లా మనోహరస్వామి, గుడ్ల రాజు స్వామి, రాపోలు స్వామి, జీడి మహేష్, నారబోయిన రమేష్, జీడి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడిలోనే ఉత్తమ విద్యాబోధన


బడిబాట కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి

బచ్చన్నపేట: సర్కారు బడిలోనే ఉత్తమ విద్యాబోధన అందుతుందని మండల కేంద్రంలోని సెకండరీ పాఠశాల హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులతో హెచ్‌ఎం మాట్లాడి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

బొడ్రాయి వార్షికోత్సవ నిర్వహణకు తీర్మానం

దేవరుప్పుల: గ్రామ ప్రతిష్ఠతకు ప్రతీకగా కొలుచుకునే బొడ్రాయి వార్షికోత్సవాల నిర్వహణ కోసం మండల కేంద్రంలోని ఆయా సామాజిక వర్గాల ప్రతినిధులు మంగళవారం ప్రత్యేక సమావేశం అయ్యారు. స్థానిక జీపీ కార్యాలయం వద్ద అన్ని కులాల సమ్మేళనంతో ఏప్రిల్ 19వ తేదీన బొడ్రాయికి పవిత్ర జలాభిషేకం, ఆయా కుల సంఘాల దేవతలకు బోనాల సమర్పణ, 20న దేవతామూర్తులకు మొక్కుల చెల్లింపులతో గ్రామ గౌరవానికి, సాంప్రదాయాలకు ప్రతిరూపంగా బొడ్రాయి పండుగను రాజకీయాలకతీతంగా నిర్వహించుకోవాలని తీర్మానం చేసుకున్నారు. గ్రామానికి చెందిన స్వచ్ఛంద దాతల సహకారంతో బొడ్రాయి వార్షికోత్సవాన్ని నిర్వహించుకునేలా సన్నద్ధం అవుతున్నారు.

రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతుల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నారని స్టేషన్‌ఘన్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్యశిరీష్‌రెడ్డి అన్నారు. సముద్రాల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరిధాన్యానికి సరైన మద్దతు ధర అందిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. పీఏసీఎస్ సీఈఓ మగ్దుంఅలీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, గుండె నర్సయ్య, తాటికొండ కుమార్, డైరెక్టర్లు సత్తిరెడ్డి, కిరణ్, సెంటర్ ఇన్‌చార్జ్ జితేందర్, రైతులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

స్టేషన్‌ఘన్‌పూర్: వేసవికాలంలో అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్‌మన్ కె.లింగయ్య అన్నారు. మంగళవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఫైర్‌స్టేషన్‌లో అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్‌తో పాటు పలు పబ్లిక్ ప్రదేశాల్లో అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్లను వేయడంతో పాటు ప్రజలను చైతన్యం చేశారు. ఫైర్‌మన్ రవి, సిబ్బంది జె.ఇంద్రాసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రజతోత్సవ సభను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: ఎల్కతుర్తిలో ఈనెల 27వ తేదీన తలపెట్టిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో స్టేషన్ ఘన్‌పూర్‌పూర్ మండలం చాగల్లుకు చెందిన గణేష్ రూపొందించిన మరో కొత్త పాట సీడీని ఆయన మాజీ ఎమ్మెల్యే రాజయ్యతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అధినేత కేసీఆర్ చేసిన పోరాటం, అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి తదితర అంశాలపై పాటలో వివరంగా ఉందన్నారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, మాజీ ఎంపీపీ మేకల కలింగరాజు, నాయకులు ఇర్రి రమణారెడ్డి, బాల్దె విజయసిద్దిలింగం, పెద్ది రాజిరెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, ఎండి సమ్మద్, ఉల్లెంగుల సందీప్, మామిడాల రాజు, పల్లవి, నర్సింహులు ఉన్నారు.


పాట సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా

జయప్రదం చేయాలి

రఘునాథపల్లి: ఈ నెల 27వ తేదీన ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో రావాలని మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జ్ వై కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం అయ్యవారిగూడెం, కుర్చపల్లి, గోవర్ధనగిరి, కోమళ్ల, శివాజీనగర్, మల్లంపల్లి గ్రామాల్లో పార్టీ కార్యకర్తలతో జరిగిన సన్నాహక సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కోమళ్లలో బీజేపీకి చెందిన ఎండీ యూసఫ్, శివాజీనగర్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన శివరాత్రి వెంకటయ్య, కుంచం వడ్డయ్యలు బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ కూడా డైరెక్టర్ కుమార్, ముసిపట్ల విజయ్ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఆపార్టీ మండల ఇన్‌చార్జ్ పసునూరి మహేందర్‌రెడ్డి కోరారు. పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మాపూర్, సూరారం, తీగారం, హిమ్మత్ నగర్, షాపల్లి, తమ్మడపల్లి (జి), ఓబులాపూర్ గ్రామాల్లో సభ సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. సభకు అధిక సంఖ్యలో ప్రజలను తరలించాలని కార్యకర్తలకు సూచించారు. రవి, బుచ్చయ్య, సోమిరెడ్డి, శంకర్, రాజ్‌కుమార్ ఉన్నారు.

'అక్రమ నిర్మాణాన్ని నిలిపేయాలి'

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లిలో తమకు చెందిన భూమిలో ఒక వ్యక్తి అక్రమంగా గృహ నిర్మాణం చేస్తున్నారని, ఈ విషయమై తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో కటకం వెంకటశ్రీధర్ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ప్రస్తుత మున్సిపాలిటీ, గత శివునిపల్లి జీపీ పరిధిలోని సర్వే నంబర్ 257లో తమకు చెందిన స్థలంలో ఒక వ్యక్తి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నాడని తెలిపారు. సదరు వ్యక్తి శివునిపల్లి తాజామాజీ కార్యదర్శితో కలిసి అక్రమంగా మ్యానువల్ కాగితాలు సృష్టించి తమ సొంత స్థలంలో దౌర్జన్యంగా అక్రమ కట్టడాలు చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై తక్షణమే స్పందించి అక్రమ నిర్మాణాలు నిలిపివేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రేషన్ షాపుల్లో మోదీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి


గావ్‌చలో-బస్తీ చలో కార్యక్రమంలో నాయకులు

నర్మెట: రేషన్ షాపుల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి ధరావత్ రాజు నాయక్ అన్నారు. గాంవ్ చలో–బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా మంగళవారం వెల్దండలో రేషన్ షాపులను, అంగన్‌వాడీ, ధాన్యం కొనుగోలు కేంద్రాలను నాయకులు పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. కరోనా సమయం నుంచి ప్రధాని మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వమే ఉచిత బియ్యాన్ని పంపిణీ చేస్తుందని, గ్రామాల్లో ఉపాధి హామీలో చేపట్టి సీసీ రోడ్ల పనులు కేంద్ర ప్రభుత్వ నిధులేనని, కాంగ్రెస్ ప్రభుత్వం తామె ఇస్తున్నట్లు చెప్పడం హాస్యాస్పదమని ఆయన తెలిపారు. రాజ్యాంగాన్ని పలుమార్లు అవమాన పరచిన కాంగ్రెస్ రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఎదుగుదలను ఓర్వలేక రెండు పర్యాయాలు ఎన్నికల్లో ఓటమిపాలు చేసిన ఘనత సాధించిందని. అలాంటి కాంగ్రెస్ జై బాపు, జై భీం, జై సంవిధాన్ నినాదంతో పాదయాత్రలు నిర్వహించడం సిగ్గు చేటని అన్నారు. బీజేపీ ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ కుటిల రాజకీయాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని, ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. నాయకులు శాతెల్లి రాజు, బొల్లం అవినాష్, కిరణ్ రాజు, గంగం గాల్ రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ


ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎంపీడీఓ

దేవరుప్పుల: కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఊరూరా స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు తలపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం పొందేందుకు చేసుకున్న ఆన్‌లైన్ దరఖాస్తులను మండల అధికారులు స్వీకరిస్తున్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ఆన్‌లైన్ దరఖాస్తులతోపాటు సమగ్ర సమాచారంతో కూడిన మ్యానువల్ దరఖాస్తు జత కలిపి తగు జిరాక్సులను తీసుకుంటున్నారు. మండలంలో ఇప్పటికే 1,450 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా సంబంధిత దరఖాస్తులు 1,200 వరకూ కార్యాలయానికి వచ్చాయని పేర్కొన్నారు.

నేడు వైద్యశిబిరం

బచ్చన్నపేట: మండల కేంద్రంలో నేడు (బుధవారం) ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ నల్లగోని పుష్పబాలకిషన్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మల్లారెడ్డి నారాయణ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్వాహకులు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నారని చెప్పారు. శిబిరంలో మోకాళ్లు, నడుం నొప్పి, రక్తహీనతతోపాటు పలు రకాల వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమున్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

నర్మెట: మచ్చుపహాడ్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గొల్లపల్లి రాజన్న (55) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. కాగా, పార్టీ ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి పార్టీ శ్రేణులు, కార్యకర్తలతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేల సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, మాజీ జెడ్పీ కోఆప్షన్ ఎండీ గౌస్, మాజీ సర్పంచ్‌లు రామిని శివరాజు, కమలాకర్‌రెడ్డి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్ తదితరులు ఉన్నారు.


పరామర్శిస్తున్న నాయకులు

సన్మానం




జనగామ రూరల్: పట్టణంలోని నూతనంగా నిర్మించిన సంతోషిమాత ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిని అర్చకుడు శ్రీనివాస శర్మను మంగళవారం విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మంచాల రవీందర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠింపజేసేందుకు శ్రీనివాసశర్మ కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కోశాధికారి రంగ నర్సింగరావు రాజు, సుశీల దేవలక్ష్మి, ప్రవీణు తదితరులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ



దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన సీనియర్ గ్రామీణ వైద్యుడు ఏల యాదగిరి జన్మదినం పురస్కరించుకుని మంగళవారం సీతారాంపురం అనాథ శరణాలయంలోని వృద్ధులకు నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు ఏల సోమసుందర్ ఆధ్వర్యంలో ప్రతినెల శరణాలయంలోని వృద్ధులకు బీపీ, షుగర్ తదితర వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఏల సరోజన, సోమసుందర్, శరణాలయ నిర్వాహకులు బ్రహ్మాచారీతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి దళితరత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న వెంకటేష్.


అవార్డుతో శ్రీనివాస్

రఘునాథపల్లి/జనగామ రూరల్: రఘునాథపల్లి మండలంలోని కోమళ్ల గ్రామానికి చెందిన బొల్లపల్లి శ్రీనివాస్, జనగామకు చెందిన అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా సీనియర్ నాయకుడు బొట్ల వెంకటేష్‌కు దళితరత్న అవార్డు వరించింది. అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఇటుక రాజు చేతుల మీదుగా వారు అవార్డు అందుకున్నారు. సేవా కార్యక్రమాలు చేయడం పట్ల ప్రభుత్వం ద్వారా దళితరత్న అవార్డు అందుకున్నట్లు శ్రీనివాస్, వెంకటేష్ మంగళవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ దుర్మరణం


సంజయ్ సావర్కర్ మృతదేహం

లింగాలఘణపురం: జనగామ–సూర్యాపేట రోడ్డులో మంగళవారం రాత్రి 11.30 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రలోని టోలీకి చెందిన కూలీ సంజయ్ సావర్కర్ దుర్మరణం చెందాడు. సంజయ్, మరో కూలీ కుల్వాల్ మామిడి తోటలో కాయలు తెంపి లోడ్ చేసేందుకు కూలీలుగా వచ్చారు. భోజనం చేసిన అనంతరం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా రఘునాథపల్లి మండలం రామన్నగూడెంనకు చెందిన సురేష్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై వచ్చి ఇద్దరిని ఢీకొట్టడంతో ముగ్గురు కింద పడి గాయాలపాలై అపస్మారక స్థితికిలోనికి చేరుకున్నారు. పోలీసులు వారిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా అందులో తీవ్రంగా గాయపడిన సంజయ్ మృతి చెందాడు.